# నాయకుడి జైత్రయాత్ర

(ఎవరికీ అక్కర్లేని కొంత హీనచరిత్రతో)

కోలాహలంగా ఉంది పట్టణం అశేషం. తోరణాలు కట్టేవాళ్ళు కడుతూనే వున్నారు. వీధులు ఖరాబు లేకుండా చేసేవారు చేస్తూనే వున్నారు. అధికారాలు చెలాయించ దలుచుకున్న వారందరికీ అదే అదను. పాతకాలపు కసి తీర్చుకొనేందుకు కూడా మంచిసందు దొరికింది. సైనుబోర్డులు, స్లయిడ్సు వ్రాసే కళాకారులందరికీ చేతినిండా పని. ఆశీర్వచన పంచకకందాలు బహుపరాక్‌గా వ్రాయగల వారందరూ తీరిక లేకుండా పనిచేస్తున్నారు. స్తోత్ర ప్రియులు పాఠాలు వల్లించుకుంటున్నారు. పన్నెండు గంటలవరకూ యథాశక్తి అందరూ పనిచేసి ఆ అలంకారాలమధ్య అందలమెక్కి ఆరగించటానికి ఆగమిస్తూన్న మహావ్యక్తి కోసం ఎదురు చూస్తున్నారు.

పన్నెండు గంటలయేసరికి 'వస్తున్నారు' అని ఒక్క పొలికేక వినబడ్డది. ఓహోహో! ఏమి ఆ విగ్రహం? ఏమి ఆ ఠీవి! ఆరడుగుల ఆజానుబాహువు. అంతకాలంగా కర్షక, కార్మికుల కోసం శ్రమించినా అరంగుళం చిక్కిపోని ఆ దీర్ఘకాయం; ఎండనక కొండనక తిరిగినా పచ్చదనం మచ్చుబడని ఆ శరీరకాంతి! యాభై సంవత్సరాలు వయిబడ్డా కార్యదీక్షతో ముందడుగు వేసే ఆ శూరత్వము, ఆ దేశసేవా పరాయణత్వము. ఆయన మనవాడై పుట్టటం మన అదృష్టం. మానవుడుగా పుట్టటం ప్రపంచ మానవుల అదృష్టం-అనుకొన్నారు అందరూ.

ఆయన వూరి పొలిమేరదాకా పొరుగు జమీందారుగారి రోల్స్ రాయిస్ కారుమీద వచ్చినా అక్కడనుంచి కారు వెనక్కి పంపేసి పాదచారియై వస్తున్నారు. ఆ మండుతూన్న ఎండలో పైన గొడుగు లేకుండా కాలిజోడుతో మాత్రం వస్తూన్న ఆయన ఎంత శ్రామికుడు (గతం నశోచామి!) ఆయన నెమ్మదిగా, నెమ్మదిగా, నవ్వులకూ వందన సమర్పణాదులు చేస్తూ చిరునవ్వులు వెలయిస్తూ ప్రక్క ప్రక్కల వస్తూన్న ఉపనాయకులతో ముచ్చటిస్తూ విజయం చేస్తూవుండగా, ఆకాశం అదిరిపోయింది. నీటితో నిండుకున్న మేఘాలు చెదిరిపోయేటట్లు, దేవుడు అనేవా డొకడుంటే వాడు బెదిరిపోయేట్లు 'జై! జై!!' నినాదాలు మార్మ్రోగినవి కంచుఢక్కాలలా.

ఏమూల చూచినా, ఏవీధి చూచినా ఆయన బొమ్మలు, ఆయన పేర్లు, జే, జే లు; జై, జై లు ఒకటేమిటి? మిన్నుముట్టిన కోలాహలం, మిన్ను దాటిన గందరగోళం. అదిఅంతా ఆయన ఆహ్వానానికి 'స్వాగత' విధానం మాత్రం. ఆయన మెల్లిమెల్లిగా నడుస్తూన్నారు. ఆయన ప్రక్క మిత్రులతో, కాబోయే తన హోదా వ్యక్తులతో సన్నగా ముచ్చటిస్తున్నారు—

'చూశారా! షేక్స్‌పియర్ చెప్పినట్లు వీళ్లంతా గొర్రెలమందలు. వెనక నాకు రావుబహదూర్ బిరుదు యిచ్చినప్పుడూ యిలానే జై కొట్టారు; జస్టిస్‌పార్టీ లీడ్ చేసినప్పుడూ యిలానే సన్మానించారు.'

ఆయన పకపక నవ్వుతూ మాట్లాట్టం అపు చేసేసరికి మహాప్రమాదం జరిగిపోయింది. అంత హడావిడిలో ఏ ప్రమాదమయినా జరిగి తీరుతుందంటే అంగీకరించవచ్చు గాని అంత అన్యాయం ఆ మహామహుడికి జరగటం సహించగలమా?

పాపం! ఒక కన్నీటిచుక్క సానుభూతిగా విడువండి-ఆయనమీద ఎంగిలాకు పడ్డది పడ్డ మయితే అది ఎగిరివచ్చి పడ్డది. ప్రక్కనున్న మునిసిపాలిటీ కుళ్ళు కుండీమీద పడిన ఎంగిలాకు గాలి విసురుకు సరిగ్గా ఆయనమీదనే పడ్డది. ఆయన కన్నులు ఎర్రబడినవి. ఆయనగొంతు గట్టిగా అరిచింది. ఆయన శరీరరథం సాగలేదు.

ఉ షా దే వి

అందరూ ఆయన కన్నులు చూస్తూన్నవైపు చూచారు. ఆయన తర్జనీ (చూపుడువేలు) బండీ మూల ఆకుల్లో మెతుకులు ఏరుకుతింటూన్న అభాగ్యుడి కంఠం ముడిని చూపిస్తున్నది. ఔను, వాడే విసిరాడు. వాడు కాకపోతే యింకెవరున్నారక్కడ ఆయనకు విరోధులు. అంతా ఒక్కుమ్మడిగా వాడిమీద పడిపోయారు రెండు జోడాక్రలు మాత్రం వాడిమీద పడినాయి. అంతే! వాడి జీవాత్మ నాయకుడి ఆత్మశాంతిని అర్థిస్తూ ఆకాశాలకు పోయింది.

జనతా జగన్నాథ రథం ముందుకు సాగింది. ప్రక్క మేడమీదనుంచి మహానాయకుడికి జరిగిన ఈ మహావమానాన్ని చూసిన బాల్యమిత్రుడు, సేట్‌జీ చకచకా క్రిందికి దిగివచ్చి ఆయనకు నమస్కరిస్తూ:

'ఇంక మీరు నడువవద్దు—నా కారు యిస్తాను ప్రక్కనే ఉన్నది. ద్రోహులు ఎక్కడా ఉంటారు డబ్బు దోచుకుందుకి దొంగలున్నట్లే, కీర్తి దోచుకుందికి ద్రోహులుంటారు.'

అని పరిపరివిధాల ప్రతిమాలి, చివరకు ఆయన చిరునవ్వును అంగీకారంగా తీసికొని కారుమీద ఊరేగింపుకు బయల్దేరారు. కారుమీద ఎవరూ ఎక్కకూడదు. ఆయనంత హోదా ఎవరికుంది కనుక, ఆయనతో సమంగా కారుమీద ఊరేగటానికి. డ్రైవరుకూడా ఎక్కటానికి వీల్లేదు. ఒకడు డ్రైవ్ చేయటం, ఒకడు కూచోటం- అది ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు మహానాయకులు. ఐతే ఎలా? అనే ప్రశ్న అంతటా ఆవరించుకొనిపోయింది. మహానాయకులు తాము స్వయముగా స్టీరింగు పుచ్చుకున్నారు.

'ఆహా! ఏమి ప్రజానాయకులు, కారు డ్రైవింగ్ స్వయముగా చేసికొనేటంత నిస్వార్థం. ఎంత శ్రామికజీవనం, ఎంత నిరాడంబరత్వం.'

అని గుండెలమీద చేతులు వేసుకుని ఘోషించింది జనత.

డ్రైవింగు చేసికోనక్కర్లేదు. మేం తోస్తాం అన్నారు అనుయాయులు. అంత దౌర్జన్యం తనలో లేదన్నారు మహానాయకుడుగారు. కాదన్నారు ప్రజ. కూడదన్నాడు నాయకుడు. చేయెత్తి నమస్కరించారు ఆయన స్వార్థ రాహిత్యానికి. మహానాయకుడు కారులో ఊరేగుతూంటే వేలకొద్దీ పూల దండలు గడ్డి మేట్లల్లే పడసాగినై. జోహార్‌లు కుప్పలు, తిప్పలయి పోయినవి.

మహానాయకుడి వెనుకటి రోజులలో కారు శరవేగంతో పోనియ్యటం సరదాగా ఉండేది. ఈ నాడు కారులో కూర్చునే సరికి, స్టీరింగు మీద చేతిప్రేళ్లు పడేసరికి ఆ నట్టనడి యవ్వనపు హుషారంతా ఒక్కసారి కలలా తోచింది. ఒక మధురస్మృతిలా రేగింది. ఉత్సాహం ఉరకలు వేసింది. ఉల్లాసం ఉప్పొంగింది.. గేరులాగి జోరుగా పోనిచ్చారు కారుని. ప్రజ, ప్రజా నాయకులు కళ్ళు తేలవేసి మహాసంతోషంతో చూడసాగారు. చప్పట్లు కొట్టారు. ఈలలు వేసారు. వెర్రికేకలు వేసారు. మహానాయకుడు మహాజోరుగా వెళ్ళిపోతున్నాడు. పోవటం పోవటం, పట్టణం పొలిమేరలు దాటిపోయింది. అప్పుడు జ్ఞప్తికి వచ్చి కారు వెనక్కు తిప్పి ఆలస్యానికి ఆవేదన పడుతూ నడుపుకొస్తున్నారు.

జోరుగా, మహావేగంగా వస్తూన్నది కారు. కారులోని స్పీడోమీటరు 50 చూపుతూ ఉన్నది. 60 సమీపిస్తూ ఉన్నది. అయ్యవారి ఆనందం ఆకాశాన్ని అంటుతూ ఉన్నది. చిన్ననాటి ముచ్చట్లు చిరుమూపుగా చూసినయ్ ఆయనవైపు. నెమ్మదిగా ఈల ఊదుతూ నడుపుతూ ఉన్నారు.

జోరుగా పోతూన్న కారు ఎంత ఆపుదామని ప్రయత్నించినా ఆగకుండా పద్నాలుగేళ్ళ అమ్మాయి పీక మీదనుంచి చనువుగా జారిపోయింది. ఆయన బుద్ధిపూర్వకంగా చేశాడా ఆ పని? చేయలేదు. కారు జోరుగా వదలటం బుద్ధిపూర్వకంగానే చేశాడు. అది ఆయన సరదాకోసం మాత్రం. అయితే కారు వస్తూన్న సంగతిగుర్తించకుండా అమ్మాయి రోడ్డు కడ్డంగా రావటం తప్పు కాదూ?

కారుకి బుద్ధి, జ్ఞానం లేవని తెలీదా? తెలుసు కాని బుద్ధీ, జ్ఞానం లేని కారు తనంత తాను నడవదనీ, ఆ రెండూకల మనిషి అందులో కూర్చుని నడుపుతాడనీ ఆ అమ్మాయికి తెలుసు. అయితే మాత్రం కారులో వెళ్ళే వాళ్ళు ఎంత గొప్ప వాళ్ళని?

[illegible] ఆకలిబాధను అర నిమిషంలో ఆరగొట్టేశారు. బొబ్బలెక్కుతున్న అరికాళ్ళమంట చల్లార్చుకుందుకి అపక్క నుంచి ఈ ప్రక్కనున్న చెట్టు నీడకు రోడ్డు దాటుతూండగానే మధ్యలోనే అమ్మాయికి అఖండమయిన, అనంతమైన విశ్రాంతి లభించింది. ఇక కూటికోసం దేవురించ నక్కర్లేదు. పెంటకుప్పలమీద ఉచ్ఛిష్టాలకోసం ఊరకలుపడి కొట్టుకో నక్కర్లేదు. ఎండల్లో మాడుతూ, వానల్లో నానుతూ బాధపడ నక్కరలేదు. ఎంత హాయి అమ్మాయికి. అందులోనూ సామాన్యమా? ఒక మహానాయకుడి కారు చక్రాలకింద. ఆహా! అమ్మాయి ఏ జన్మాంతర సుకృతమో!

కారు వెళ్ళి, వెళ్ళి ఉపన్యాస వేదికముందు ఆగింది. మహా నాయకుడు 'జయజయ' నినాదాల మధ్య తోరణాలంకృత వేదిక నధిరోహించాడు. పరిచయాదులు, ప్రస్తావనలు. బహూకరణలు, దండక స్తవాలు, శతకస్తోత్రాలు, స్వీయచిత్రాలు స్వహస్తరేఖా చిత్రాలు-అవీ. ఇవీ సర్వ సర్వస్వ సమర్పణ జరిగింది. మహా నాయకుడు గడగడ రెండు గ్లాసులు మంచినీరు అనుపాన సహితంగా సేవించి ఒక్కసారి సంప్రదాయికంగా గొంతు సవరిస్తూ దగ్గి ఉపన్యాసానికి ఉపక్రమించారు. అనర్గళంగా దేశంలోని ఆకలి సమస్యా నివారణ గూర్చి, దుర్భర దారిద్ర్యం శ్రమికజనతను వేధిస్తూన్న విధానాన్నీ, దాన్ని పరిమార్చటానికి గల పద్ధతులను సమగ్రంగా వివరించారు.

'దుర్భర, దుస్సహ, దురంత వేదనామయ యాతన జీవితాన్ని సాగిస్తూన్న వారికైనా జీవితం అంకితం' అని ముగించారు మహా నాయకులు.

'ఓహో! శ్రామికబాంధవా! అన్నార్తశరణ్యా! ఆపద్బాంధవా!' శరణు శరణు అన్నారు మహా ప్రజ మహానాయకుని మనోహర ముఖారవిందంలో ఒక సుందర మందహాసశ్రీ చిందులు తొక్కింది. రకరకాలుగా వైతాళికులు అంతిమ స్తవం చేశారు మహానాయకుడు బహు రహస్యంగా సేకరింపబడిన నిధిని తప్పనిసరిగా ఎడంచేత్తో వద్దంటూ కుడిచేత్తో స్వీకరిస్తూ వేదిక దిగి రెండడుగులు వేశారు.

శాశ్వత నిద్రలోవున్న అమ్మాయిమృత దేహాన్ని ఈడ్చుకుంటూ అమ్మాయి తల్లి అదే వేదికమీదకు వచ్చి వాలింది. 'మహా నాయకుని ఆగమన సందర్భంలో ఇద్దరు అన్నార్తులకు శాంతి ప్రసాదం. శాశ్వత నిద్రాదానం' అని గ్రామ దేవత ఉద్ఘాటించింది. అమ్మాయి తల్లి ఒక్కసారి అమ్మాయి తలను ముద్దు పెట్టుకొంది. పోతూన్న జనప్రవాహం వంపు తిరిగి మొర పెట్టుకొన్నది. మొరమొరగానే తిరిగి వచ్చింది. గంట లేదాలో భర్త, కూతురు స్వర్గం చేరుకున్నారు. ఎంత శాంతి! వారెంత పుణ్యం చేసుకొన్నారు,

సాయంకాలం శ్మశానంలో చిదపచితుకులతో రెండు శవాలు జాజ్వల్యమానంగా అనంతాకాశంలో విలీనమైనై! ఆ రెంటికి రెండే రెండు అశ్రుతర్పణాలు సమర్పించింది ఆతల్లి— మహానాయకుడు ఘనంగా మరో గ్రామం వెళ్లారు.

# ఎవరో?

బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

తిమిరదేవి నీలాలక
లమావాస్య, అర్ధరాత్రి
అభ్యంగన మాడిపోక
ఆలింగించారెవరో?!

గ్రీష్మకాల కీలాత్తుల
కిరకిరమని కేరింతలు
మధ్యాహ్నపు మార్తాండుని
రథ్యలు కాశారెవరో!

శరత్కాంత దరహాసపు
విరజాజులు వెన్నెలలో
వెనుకలేక విసిరి విసిరి
వేదన తీర్చారెవరో!

వార్షుకతరుణీ హృదయా
కర్షక నర్తన సంధ్యను
రక్తిమ కన్నులు చెదర, వి
రక్తులు అయ్యారెవరో!